# కడసారి

## ఒక స్వగతం

తొలిసారి, ఇక్కడే, ఇలాంటి చీకటిలోనే, ఇక్కడే, ఈరాధారివంతెనమీదే, ఈ చెట్టుకిందే, నిన్ను చూడాలని నా కన్నులు తహతహలాడుతున్నప్పుడు, నీతో మాట్లాడాలని మనసువ్విళ్ళూరుతున్నప్పుడు, తొలిసారి...

ఇక్కడే, ఈపొదచాటున, ఈలతమాటున, ఈరాధారివంతెనమీదే, పంచరంగుల కలలుకనే రోజులలో—భవిష్యత్తు బంగారంలా కనబడే రోజులలో, తొలిసారి ఇక్కడే, ఇక్కడే, సత్యం, తొలిసారి, ఇక్కడే,నన్ను కలుసుకొన్నావు. ఇప్పటిలాగే అప్పుడుకూడా ఇలాంటి చీకటిలోనే ఈవంతెనమీదే...

ఇక్కడే ఈ వంతెనమీద నా జీవితంలోకి నువ్వొచ్చావ్. నాగుండెల్లోని ఇసుకతిన్నెలమీద వెన్నెల కురిపించావు. నువ్వొచ్చాక, నా జీవితంలోకి నువ్వొచ్చాక ఈ వంతెనకింద నదిలోకి నీళ్ళొచ్చాయి. నా కన్నులలో తొలిసారిగా ఆనందానికిమల్లే ఈ నదిలోకి నీళ్ళొచ్చాయి. ఇప్పుడు కూడా ఆనీళ్ళు గలగలా పారుతున్నై. సత్యం, కలకలా పాడుతున్నై.

తొలిసారి నిన్ను కలుసుకొన్నాక నన్ను నేను ప్రశ్నించుకొన్నాను. సిగ్గులు చిగురించెనే, బుగ్గలు ఎరుపెక్కెనే,

కన్నులు కైపెక్కనే—కారణాలు చెప్పవే. కారణాలు చెప్పవే...నామనసులోని ప్రశ్నలు నీ కెలా తెలిశాయో, పెదవి విప్పకుండానే నీ మనసు, నీచూపుల భాషలో నా సందేహాలకి సమాధానం చెప్పింది అయ్యోరామ, అయ్యోరామ! అదే తొలిప్రేమ, సిరివెన్నెలప్రేమ, అని నువ్వు చెప్పకుండా జెప్పిన సమాధానం, వినబడని నీ తియ్యని సమాధానం నా చెవులు విన్నాయి.

ఇప్పుడు మా వాళ్ళకి లేఖ పంపించావు. లేఖ, శుభలేఖ. అప్పుడు లేఖ నాకే పంపించావు, తొలిసారి, పంపించావు. సత్యం, అదే నిజమైన శుభలేఖ. అది నా భగవద్గీత. అది నా వేదం. ఆ లేఖలో ఒక్కటే వాక్యం ఉంది. అది నన్ను కనుకట్టు కట్టిన మంత్రం. అది ఎన్నికోట్లసారులు వల్లించాను, మనసులో అనుకొన్నాను. 'నన్ను వంతెన మీద చెట్టుకింద కలుసుకో'—నన్ను వంతెనమీద చెట్టుకింద కలుసుకో - ఒకటేవాక్యం, అదే వేదవాక్యం.

నిన్ను కలుసుకోమన్నావు. ఎక్కడ కలుసుకోవాలో చెప్పావు. కాని, ఎప్పుడు కలుసుకోవాలో చెప్పలేదు. ఆచీటీ అందిన దగ్గర్నుంచి ఎప్పుడా, ఎప్పుడా అని ఎదురుచూశాను. పట్టపగలు రాకపోకలు సాగుతున్నప్పుడు, ఇక్కడే, ఈ రాధారి వంతెనమీదే, నీకోసం, నీకోసం నిలబడదామనుకొన్నాను. వచ్చేపోయేవాళ్ళు నన్ను చూస్తేనేం చూడనీ; ఏమైనా అనుకొంటారేమో అనుకోనీ. నిన్ను కలుసుకొనడానికి ఎన్ని జన్మలనుంచో ఎదురుచూస్తున్నాను. నువ్వు ఈ జన్మలో

కలుసుకోమన్నావు. ఇక్కడే ఈ వంతెనదగ్గరే కలుసుకో మన్నావు. అశుభం శుభం తెలియని రోజులనుండీ ఆనందం కోసం అర్రులు చాచాను. అందకముందే అది నా చెయి జారిపోతుందేమోనని హడలిపోయాను; సత్యం, హడలి పోయాను. నువ్వు రమ్మన్నావు. నేను వచ్చేలోగానే నువ్వు నాకోసం వస్తావేమో, నేను రాలేదని కోపగించి తిరిగిపోతా వేమో...నువ్వే తొలిసారి పంపిన లేఖ అందగానే అది పట్టు కొని ఇక్కడ కొచ్చాను.

అప్పటి కింకా నువ్వు రాలేదు. ఇంకా చీకటిపడలేదు. ఇంకా రాకపోకలు తగ్గలేదు. ఒకళ్ళిద్దరు నన్ను చూశారు. చూడనీ...నావైపువస్తున్న ప్రతిఅడుగుచప్పుడూ నీదే అను కొన్నా. అందుకే చూశాను. ఒకళ్ళిద్దరుచూసినట్టు అందుకే నాకు తెలిసింది. వాళ్ళు తెలిసినవాళ్ళే...మావాళ్ళకిబాగా తెలిసిన వాళ్ళు. నేను భయపడలేదు. సత్యం, నీకోసం ఏమైనా చేద్దామనుకొన్నాను. నీకోసం ప్రపంచపుటంచుల దాకా, వెళ్ళవలసివస్తే వెళ్ళడానికి తయారయ్యాను.

నిముషం యుగమైంది. నువ్వు రాలేదు...రాకపోకలు తగ్గాయి. నువ్వురాలేదు...నిశ్శబ్దం అలుముకొంది. చీకటి కమ్మింది, నువ్వురాలేదు. నాకళ్ళు కాయలు కాచాయి... కాళ్ళు బరువెక్కాయి...గుండెలు బరువెక్కాయి... కళ్ళంట నీళ్లు తిరిగాయి, నిట్టూర్పులు వెలువడ్డాయి, నువ్వు రాలేదు...ఇటు పక్కన దూరాన గుడిలో గంటలు కొడుతు న్నారు, నువ్వు రాలేదు అటుపక్క దూరాన కోటలో ఏడు

గంటలు కొట్టాను; నువ్వు రాలేదు నువ్వు రాసిపంపిన చీటీని చీకటిలోనే విప్పాను. చీకటిలో మళ్ళా చదివాను. రాధారి వంతెనమీద చెట్టుకింద నన్ను కలుసుకో... నువ్వు రాలేదు. వంతెనకింద నీళ్ళు ఎండిపోయాయి. నా ఆశలు ఇంకిపోయాయి. నువ్వు రాలేదు.

చంద్రోదయమైంది. చెట్ల ఆకుల్లోంచి చూశాను. అప్పుడే ఉదయిస్తూన్న చంద్రుడు అదృష్టవంతురాలి నుదుటి మీది అయిదోతనంలాగ ఉన్నాడు. నువ్వొచ్చావు సత్యం నువ్వొచ్చావు...చంద్రోదయంలాగ వచ్చావు. నా అదృష్టంలాగ, నా నుదుటిమీదకొచ్చే అయిదోతనంలాగ నువ్వొచ్చావు, చివరికి నువ్వొచ్చావు.

ఇక్కడే, ఈ రాధారివంతెనమీదే, ఈ చెట్టుకిందే, ఈ పొదచాటున, ఈ లతమాటున నవ్వుతూ నిలబడ్డావు. అరనిముషంసేపు నిలబడ్డావు. ఆ తరవాత అలా తోటలోనికి రా అనిచెప్పావో, సైగ చేశావో—ఈ చెట్టుదగ్గర్నుంచే, ఈ వంతెనమీదుగానే నిన్ను అనుసరించాను. ఈ వంతెనే నా భవిష్యత్తుకి బాట...కష్టాలలోంచి సుఖానికి వంతెన, కర్పూర స్వప్నాలకి కమ్మని సత్యానికీ వంతెన...ఈ వంతెనమీదుగానే నడిచాను తోటలోకి నీతో. నీకోసం, నీవెనుక, నిన్నే కోరుకుని, నిన్నే నమ్ముకుని బయల్దేరాను, సత్యం...

అదిగో కనబడుతోంది. ఆ దేవాలయం తోటలో ఇలాంటి చీకటిలోనే నువ్వు పెదవి తెరచావు ఆశలమాటలు, ఆశయాల పాటలు వర్షం కురిపించావు. నేను నా మనస్సు

విప్పాను. అది నీకు అర్పించాను. ఇప్పుడు కొడుతున్నట్టే అప్పుడుకూడా దేవాలయంలో గంటలు కొడుతున్నారు. గాజులులేని నా మణికట్టు నీ పిడికిల్లో ఇమిడింది. నా చేతులకి మళ్ళా గాజులు తొడుక్కునే భాగ్యం కలుగచేస్తానన్నావు. నాకురులు నిమురుతూ, పువ్వులకీ, నాసిగకీ మళ్ళా స్నేహం కలుపుతానన్నావు. నా పెదవులమీదికి చిరునవ్వునీ, నుదుటిమీదికి కుంకుమరేఖనీ తీసుకొస్తానని ప్రమాణం చేశావు. నా మెడమీద నీ చెయ్యి వేసినచోట మంగళసూత్రం కడతా నన్నావు దేవాలయంలో జేగంటకొడుతూ ఉండగా అన్నావు జయం జయం అని.

దైవసాక్షిగా నిన్ను నమ్మాను. దైవసాక్షిగా నిన్ను కలుసుకొన్నాను. అదుగో ఆ దేవాలయం తోటలోనే నేను నీకు పాతబడేదాకా, నీ అవసరం తీరేదాకా, అసహ్యం వేసేదాకా నన్ను కలుసుకొన్నావు. స్వప్నాలు చూపించావు. ఆఖరుసారిగా మనం దేవాలయంతోటలో కలుసుకోడం నువ్వు మరిచిపోయినా, నేను మరచిపోలేను. ఈదురుగాలి వీస్తున్నది. వర్షం పడుతున్నది. వానలో తడిసి ముద్దయి నీకోసం కాచుకుని ఉన్నాను. అనుకొన్న వేళకి కాక ఆలస్యంగా వచ్చావు. 'మరి మనం కలుసుకోడానికి వీల్లే' దన్నావు. ఎక్కడో పిడుగుపడ్డది. నా గుండెల్లో పిడుగుపడ్డది. నాగతేంకాను అని అడిగాను. నువ్వు జవాబు చెప్పలేదు. నన్నేం చెయ్యమన్నావని అడిగాను. నువ్వేదో జవాబు చెప్పావు. వానలో, ఈదురుగాలిలో, హోరులో నువ్వుచెప్పిన

జవాబు నాకు వినబడలేదు. నా జీవితంలోకి వెలుతురు తెస్తా వనుకొన్నాను. చీకట్లో వదలి వెళ్ళిపోయావు. ఆశాభంగంతో మొహంతిరిగి, స్పృహతప్పి చెట్టుకింద వర్షంలో మూర్ఛ పడ్డానో లేదో చూడకుండా వెళ్ళిపోయావు. కటికరాయి నీ మనసు; కత్తులు నీ మాటలు.

నన్ను మరచిపోయావు. నువ్వు మళ్ళీరాలేదు. నీ దారి నువ్వు చూసుకొన్నావు. నీ ఆనందమే నీకు కావాలి. నువ్వు రాలేదు. నా దుఃఖంలో నేను మునిగి ఆరోజుల్లో లోకాన్నే మరిచిపోయ్యాను. నా నుదుటిమీద కుంకుమరేఖ అంతకు ముందే చెరిగిపోయింది. నా గాజులు విరిగిపోయాయి! అగ్ని హోత్రంముందు ప్రమాణంచేసినవారితో కలసి జీవితాన్ని పంచుకొనడానికీ ముందే నేను వంటరిదాన్నయాను. ఆనందం లోకి అడుగుపెట్టడానికిముందే విచారంలో మునిగిపోయాను. పెళ్ళయిన మొదటినెలలోనే అత్తవారింటికి వెళ్ళడానికి తయారవకముందే పుట్టిల్లే నాకు శాశ్వతమయింది. ఈడూ జోడూ కలిసినవారు, కలిగినవారు, చదువుకొన్నవారు, అంద మైనవారు– నా సంతోషం, నా స్వప్నం, నా గర్వం, వారు, మావారు– సారెగదిలో నాకొంగున కాసుకట్టకముందే కారు ప్రమాదంలో కన్నుమూశారు. నేను వంటరిదాన్నయ్యాను.

నన్నెలా ఆకర్షించాలో నీకు తెలుసు. నన్ను ఆక ర్షించావు. చీటీ పంపించావు, లేఖ – అదే నా శుభలేఖ. ఈ వంతెనమీద ఈచెట్టుకింద ఇక్కడే నిన్ను కలుసుకొన్నాను. మనసులోని బరువు దింపుకోడంకోసం, స్నేహంకోసం, సాను

భూతికోసం నిన్ను కలుసుకొన్నాను. దేవాలయంలో గంటలు కొడుతూవుంటే నన్ను పెళ్ళిచేసుకుంటా నన్నావు సత్యం... నన్ను పెళ్ళిచేసుకొంటా నన్నావు.

అవును-పెళ్ళి చేసుకొంటున్నావు. శుభలేఖ పంపించావు. కానీ నన్ను కాదు. నన్ను కాదు. ఈ శుభలేఖలో నా పేరుకు చోటులేదు. ఒక లేఖలో నా పేరు కనబడ్డది. అదే తొలిసారి, అదే కడసారికూడా. సత్యం నీ నిశ్చయాలు, నీ నిర్ణయాలు ఏమయ్యాయి? పెళ్ళి చేసుకొంటున్నావు. పెద్దలు నిర్ణయించినపెళ్ళి చేసుకొంటున్నావు. అదుగో మేళాలు, ఊరేగి వస్తున్నావు. తరలి వస్తున్నావు

ఇక్కడే, ఈ వంతెనమీదే, ఈచెట్టుకిందే ఈ చీకట్లో నీకోసం పెళ్ళికూతురు కాచుకొనిఉంది. ఇదుగో నీ పెళ్ళికూతురు కాచుకొని ఉంది. అదుగో లైట్లవెలుతురు. నాకోసం వెలుతురు తెస్తున్నావు. కాదు...నాకోసంకాదు... కాదు...నాకోసం రావు. దేవాలయంలో వర్షంలో నువ్వు చెప్పినదే నిజం, మరి మనం కలుసుకొనకూడదు... నాగతేం కాను. నడిసముద్రంలో మునిగిపోతూఉంటేవదలిపెట్టివెళ్లావే! ఏమైనా నా ప్రయత్నం నాదే నిర్ణయం. ఈ నదిఒడ్డున ఏముంది? ఏడుపు, చీకటి...చచ్చిపోదా మనుకొన్నాను. దేవాలయం తోటలో నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోయాక చచ్చిపోదా మనుకున్నాను. కానీ, ఆశ, ఆనందం నా కడుపులో ఆకారం ఏర్పరచుకొంటున్నాయి. కొన్నినెలలు ఓపికపడితే

నా రక్తాన్ని పంచుకొని నా పేరు తెంచుకొని నా పాప రావచ్చు. అందుకే బతికాను. సత్యం, అందుకే బతికాను.

మూడు నెలల కిందట విడిచిపెట్టి వెళ్ళావు. మూడు రోజులకిందట శుభలేఖ పంపావు.

జ్వరంలో బాధలో మేడమెట్లమీద నిలబడి శుభలేఖ చదివాను. మూర్ఛపడ్డాను. లోకం తలకిందులైంది. ఆశ తలకిందులైంది. భవిష్యత్తు తలకిందులైంది. ఎవరికోసం, ఏ పాపకోసం, ఏసంతోషంకోసం జీవిస్తున్నానో ఆ ఆకారం ఏర్పడకముందే కరిగిపోయింది. ఏం చూసుకొని బతికేది. సత్యం ...ఇంకెందుకు బ్రతకాలి.

అదిగో వస్తున్నావు. ఊరేగి వస్తున్నావు. ఈ వంతెన మీదే ఇక్కడే ఈచెట్టుకిందే తొలిసారి నిన్ను కలుసుకున్నాను. ఇప్పుడు కలుసుకొంటాను. ఊరేగింపు ఆపుతాను. అడుగుతాను నాగతేం కావాలో, నే నెందుకు బ్రతకాలో అడుగుతాను. నీప్రక్కన నీకార్లో కూర్చుంటాను. నీచేత్తో నా నుదుట కుంకుమరేఖ పెట్టించుకుంటాను. వస్తున్నావా ప్రియతమా...

రా! దుర్మార్గుడా! రా! నీకు ప్రాయశ్చిత్తంచేస్తాను. ఊఁ? తప్పా? చెయ్యను. అడగను...అడగను సత్యం! నువ్వు ఆనందంగా పెళ్ళిచేసుకో! నువ్వుచేసిన నేరానికి ఇంకో ఆడపిల్ల- నాలాంటి ఆడదాన్ని- ఎందుకు గాయపర్చాలి. పెళ్ళి రోజున ఎందుకు బాధపెట్టాలి...పెట్టకూడదు...

వెళ్ళు! పెళ్ళిచేసుకో! కాని నిన్ను ఒక్కసారిచూడాలి సత్యం...వస్తున్నా...నువ్వు వెయ్యేళ్ళు సుఖంగా ఉండాలి.

వెళుతున్నా సత్యం. ఈవంతెనమీద నువ్వు ఊరేగి వస్తున్నప్పుడు ఈలతని చూశాక, ఈ పొదనిచూశాక, ఈ చెట్టుకిందకి నీ చూపువచ్చాక ఒక్క సారి చిరునవ్వు నవ్వు... ఆ...తరువాత అంతా మరచిపో! మరచిపో సత్యం! ముందు జీవితంలో నేను నీకు జ్ఞాపకం ఉండకూడదు. సత్యం! సత్యం వెళుతున్నా, సత్యం...వెళుతున్నా.